సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం । 24 । ఏప్రిల్ । 2023



వెంకన్న ఆలయానికి రూ.లక్ష విరాళం


ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి యాళ్ల వెంకయ్యనాయుడు, కుసుమ కుమారి దంపతులు (హైదరాబాద్) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధిలో సుదర్శన హోమానికి, గోశాలకు సీహెచ్ మహేశ్వర్, అపర్ణ దంపతులు (హైదరాబాద్) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

డెల్టాలకు 3,800 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 3,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు, మధ్య డెల్టాలకు చెరో 1,000, పశ్చిమ డెల్టాకు 1,800 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 5.40 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

మంత్రి సురేష్, దళితులపై దాడి అమానుషం



బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్సీ

అమలాపురం టౌన్: ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్‌తోపాటు దళితులపై తెలుగుదేశం పార్టీ దాడి చేయించడం అమానుషమని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. **ఈ ఘటనపై తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.** అమలాపురంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో చంద్రబాబు తీరుపై ధ్వజమెత్తారు. క్షమాపణ చెప్పకపోతే చంద్రబాబు ఇకపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నిర్వహించే పర్యటనలను అడ్డుకుంటామని ఇజ్రాయిల్ హెచ్చరించారు. తమ కార్యకర్తలను రెచ్చగొట్టి దళితులపై దాడి చేయించడమే కాకుండా ఆపై బుకాయిస్తూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు దాడి చేశారని చంద్రబాబు ఎదురుదాడికి దిగడం ఆయన నైజాన్ని మరోసారి రాష్ట్ర ప్రజలు చూసేలా చేసుకున్నారని పేర్కొన్నారు. మీ పచ్చ చొక్కాల కార్యకర్తలు బహిరంగంగా రాళ్లు విసరడం ఆధారాలతో దొరికినప్పుడు నువ్వు ఎందుకు క్షమాపణ చెప్పడం లేదని చంద్రబాబును ఇజ్రాయిల్ ప్రశ్నించారు.

యథావిధిగా స్పందన

అమలాపురం రూరల్: జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిలలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాలు సోమవారం యథావిధిగా జరుగుతాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో స్పందన హాలులో జిల్లాస్థాయిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అర్జీదారుల నుంచి విజ్ఞాపనలు స్వీకరిస్తారని, అదేవిధంగా డివిజన్, మండల కార్యాలయాలలోను స్పందన కార్యక్రమం ఉంటుందని, గ్రామ వార్డు సచివాలయాల్లో మాత్రం మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య అర్జీదారుల నుంచి విజ్ఞాపనలు స్వీకరిస్తారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

కిక్కిరిసిన అయినవిల్లి

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ అర్చకులు సత్తిబాబు ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి లఘున్యాస అభిషేకాల్లోను, లక్ష్మీగణపతి హోమంలోను అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. స్వామివారికి గరిక పూజ జరిపారు. నూతన వాహనాలకు పూజలు చేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనం ద్వారా రూ.15,000, అన్నప్రసాదాలకు వచ్చిన విరాళాలు రూ.2,30,000, వివిధ సేవల ద్వారా రూ.14,000, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.31,000, వివిధ విరాళాల ద్వారా రూ.19,000 మొత్తం రూ.3,09,000 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

మా 25 ఏళ్ల నిరీక్షణ ఫలించింది

అమలాపురం టౌన్: ఇటీవల జిల్లావ్యాప్తంగా 91 మంది 1998 క్వాలిఫైడ్ టీచర్లను ప్రభుత్వం మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) ఉపాధ్యాయులుగా నియమించిన నేపథ్యంలో వారు డీఈవో ఎం.కమలకుమారిని అమలాపురంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్యాబోధన చేసి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు శ్రమించాలని సూచించారు. అమలాపురం డీవైఈవో కార్యాలయంలో ఉన్న డీఈవో కమలకుమారిని వీరు కలిసి తమ 25 ఏళ్ల నిరీక్షణ ఫలించిందని, ఇన్నేళ్ల తర్వాత ముఖ్యమంత్రి జగన్ తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించి ఉపాధి బాటలు చూపించారని పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ కేశవ్‌కుమార్, సంఘ జిల్లా ప్రతినిధులు కేవీ శ్రీనివాస్, అక్కిరాజు ఫణిరాజు, అల్లు వజ్రకుమార్, మామిడిపల్లి సాయి తదితరులు డీఈవోకు పుష్పగుచ్ఛం అందించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

రాయవరం: ఏపీ గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. కోనసీమ జిల్లాలో ఐదవ తరగతికి నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 57.2 శాతం మంది హాజరు కాగా, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశ పరీక్షకు 78.35 శాతం మంది హాజరయ్యారు. ఐదవ తరగతికి ద్రాక్షారామం, పి.గన్నవరం, అల్లవరం(బాలురు), గోడి, ముమ్మిడివరం, రాజోలు గురుకుల పాఠశాలల్లో పరీక్ష నిర్వహించారు. జిల్లాలో 480 సీట్లకు 738 మంది దరఖాస్తు చేయగా, 422 మంది హాజరయ్యారు. ఇంటర్‌లో ప్రవేశానికి ఆరు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. 480 సీట్లకు 822 మంది దరఖాస్తు చేసుకోగా, 644 మంది హాజరు అయ్యారు. పరీక్షా కేంద్రాలను జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబు, రామచంద్రపురం ఆర్డీవో సింధుసుబ్రహ్మణ్యం, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కోఆర్డినేటర్ అంగడి మురళీకృష్ణ తనిఖీ చేశారు.

ఆదర్శ పథం.. అగ్రస్థానం

- మూడు పంచాయతీలకు రాష్ట్ర స్థాయి అవార్డులు
- గుడ్ గవర్నెన్స్‌లో సఖినేటిపల్లి
- క్లీన్ అండ్ గ్రీన్‌లో బిళ్లనందూరు
- విమెన్ ఫ్రెండ్లీగా జేగురుపాడు
- నేడు అందజేత

సాక్షి ప్రతినిధి, కాకినాడ: నలుగురి మేలు కోసం ఏం చేసినా దాని ఫలితం ఏదో ఒక సమయంలో తప్పకుండా శిఖరాగ్రాన నిలబెడుతుంది. అటువంటి ఉత్కృష్ట సేవలతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని మూడు గ్రామ పంచాయతీలు ఇప్పుడు అదేవిధంగా రాష్ట్ర స్థాయిలో సమున్నత స్థానాన్ని సాధించాయి. ఎన్నికల వరకే రాజకీయాలు.. ఆ తరువాత అంతా ఒక్కటేననే భావనతో అభివృద్ధికి సమష్టి కృషి చేస్తూ, ఆ పంచాయతీలు రాష్ట్ర స్థాయిలో పురస్కారాలకు ఎంపికయ్యాయి. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో ఈ పురస్కారాలను ఆయా పంచాయతీల ప్రతినిధులు అందుకోనున్నారు. తొమ్మిది అంశాల ప్రాతిపదికగా అవార్డుల ఎంపిక జరగగా ఉమ్మడి 'తూర్పు'న ఒక్కో జిల్లా నుంచి ఒక్కో గ్రామ పంచాయతీ ఒక్కో అంశంలో పురస్కారానికి ఎంపికయ్యాయి. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్(ఆర్‌జీఎస్‌ఏ)లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ మూడు గ్రామ పంచాయతీలను ఎంపిక చేసింది. సుపరిపాలనలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి గ్రామ పంచాయతీ మొదటి స్థానంలో నిలిచింది. క్లీన్ అండ్ గ్రీన్ విభాగంలో కాకినాడ జిల్లా కోటనందూరు మండలం బిళ్లనందూరు, విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ విభాగంలో తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం జేగురుపాడు గ్రామ పంచాయతీలు ద్వితీయ స్థానాలు దక్కించుకున్నాయి. పాలకవర్గాలు, అధికారుల సమన్వయ కృషి ఫలితంగా ఆయా పంచాయతీలు రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాయి.



సఖినేటిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

ఉత్తమ సేవలు, పాలనతో..

కోవిడ్ మహమ్మారి, వరుసగా గోదావరి వరదల సమయంలో రోగులకు, ప్రజలకు అందించిన సేవలకు సఖినేటిపల్లి గ్రామ పంచాయతీ గుడ్ గవర్నెన్స్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచింది. 12 వేల జనాభా కలిగిన ఈ పంచాయతీలో 14 వార్డులున్నాయి. ఇక్కడి పాలకవర్గ సభ్యులు, అధికారులు కరోనా వ్యాప్తి సమయంలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు. రోగులను ఆదుకున్నారు. దీంతో పాటు నిత్యావసర సరకులు, కూరగాయలు, బియ్యం పంపిణీ ద్వారా పేదల ఆకలి తీర్చారు. అలాగే గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చల్లించడం, దోమల నివారణకు, గీతామందిరం, రత్నాలపేట, లాకుపేట, కుమ్మరిగరువు, సంజీవయ్య కాలనీ, పాలెం సెంటర్లలో మురుగు నీటి గుంతలు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఈవిధంగా సమన్వయంతో సుపరిపాలన అందించడం ద్వారా ఈ పంచాయతీ ఈ అవార్డుకు ఎంపికైంది. పీజీ చదివిన సర్పంచ్ చిట్టిబాబు మొదటి నుంచీ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఇదే ఒరవడితో సర్పంచ్‌గా కూడా రాణించారు.

గరిష్ట స్థాయిలో సేవలు



పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ, ప్రజారోగ్యం వంటి ప్రాధాన్య అంశాల్లో ప్రజలకు గరిష్ఠంగా సేవలు అందిస్తున్నాం. గ్రామసభల్లో ప్రజలు లేవనెత్తే సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేటట్టు చూస్తున్నాం. వితంతువులు, దివ్యాంగులు, మహిళలు, బాలల పట్ల నిబద్ధతతో వ్యవహరిస్తున్నాం.

– గొల్లమందల చిట్టిబాబు, సర్పంచ్

స్త్రీ చైతన్యానికి చేసిన కృషితో..

విమెన్ ఫ్రెండ్లీ విభాగంలో తూర్పు గోదావరి జిల్లా జేగురుపాడు పంచాయతీ రాష్ట్ర స్థాయి ద్వితీయ స్థానం సాధించడం వెనుక సర్పంచ్ స్టాలిన్, పాలకవర్గం, యంత్రాంగం సమష్టి కృషి ఉన్నాయి. 5,719 జనాభా ఉన్న ఈ గ్రామంలో 2,847 మంది మహిళలున్నారు. 14 మంది వార్డు సభ్యుల్లో ఏడుగురు మహిళలే. ఈ పంచాయతీలో మహిళా అక్షరాస్యత, మహిళల చైతన్యానికి చేపట్టిన కార్యక్రమాలు అవార్డుకు ఎంపిక చేయడంలో కీలకమయ్యాయి. ఎక్కడో పట్టణాలు, నగరాల్లో మాత్రమే ఉండే ఓపెన్ ఎయిర్ జిమ్ జేగురుపాడు వంటి పల్లెలో ఏర్పాటు చేయడం విశేషం. తెల్లవారుజామున 4 నుంచి ఉదయం 9, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకూ సుమారు 100 మంది మహిళలు, 250 మంది బాలికలు ఈ జిమ్‌కు వస్తుంటారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో 1,200 జాబ్‌కార్డులు ఉండగా వీరిలో 800 మంది మహిళలే ఉండటం గమనార్హం. అంగన్‌వాడీ మహిళలు, చిన్నారులకు పోషకాహార లోపం లేకుండా చూడటం, బాలికా విద్యకు ప్రోత్సాహం వంటి కార్యక్రమాలు ఈ అవార్డు ఎంపికలో ముఖ్య భూమిక పోషించాయి.



జేగురుపాడు ఓపెన్ ఎయిర్ జిమ్‌లో మహిళలు

గ్రామస్తుల సహకారంతో...



గ్రామస్తుల సహకారంతోనే రాష్ట్ర స్థాయి అవార్డు సాధ్యమైంది. గతంలో కూడా మా గ్రామానికి పలు అత్యుత్తమ అవార్డులు వరించాయి. వీటికి కొనసాగింపుగా ప్రస్తుత అవార్డు కూడా గ్రామస్తులకు సంతోషాన్ని కలిగిస్తోంది. జేగురుపాడు సర్వతోముఖాభివృద్ధి సాధించాలన్నదే నా లక్ష్యం. ఇందుకు సహకరిస్తున్న ప్రజాప్రతినిధులకు, గ్రామస్తులకు కృతజ్ఞతలు.

– యాదల సతీష్ చంద్రస్టాలిన్, సర్పంచ్, జేగురుపాడు

పారిశుధ్యం - పచ్చదనంతో..

పారిశుధ్య నిర్వహణ, పచ్చదనాన్ని పెంచేందుకు చేసిన విశేష కృషికి గాను కాకినాడ జిల్లా కోటనందూరు మండలం బిళ్లనందూరు పంచాయతీకి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ పురస్కారం లభించింది. పంచాయతీ ఆధ్వర్యాన గ్రామంలోని ప్రతి ఒక్కరితో మొక్కలు నాటాలనే అవగాహన కల్పించారు. ఏ అవసరం ఉన్నా చెట్లను నరికివేయడం అనే దుష్ట సంస్కృతిని అవగాహన కల్పించడం ద్వారా కట్టడి చేశారు. 2,422 జనాభా ఉన్న ఈ గ్రామంలో పచ్చదనం – పరిశుభ్రత కోసం ఐదుగురు గ్రీన్ అంబాసిడర్లు 25 వీధుల్లో ఉదయాన్నే పారిశుధ్య పనులు నిబద్ధతతో చేస్తారు. తమ ఇంటిని శుభ్రం చేసుకుంటున్నట్టుగానే వారు ఈ పనులు నిర్వహిస్తారు. సర్పంచ్, పాలకవర్గం, అధికారులు సమన్వయంతో రెండు రోజులకోసారి పారిశుధ్యంపై పర్యవేక్షిస్తున్నారు. గ్రామ శివారు, గ్రామకంఠం భూముల్లో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి గాలికొదిలేయడం కాకుండా రోజూ నీరు పోసి పచ్చదనానికి పురుడు పోశారు. అవార్డు సాధన వెనుక సర్పంచ్ బొత్స మంగ, పాలకవర్గం, అధికారులు, గ్రీన్ అంబాసిడర్ల పాత్ర వెలకట్టలేనిదని గ్రామస్తులు అభినందిస్తున్నారు.



బిళ్లనందూరులో పారిశుధ్య పనుల్లో గ్రీన్ అంబాసిడర్లు

నిబద్ధతకు ఫలితం



ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా పారిశుధ్యం, పచ్చదనానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. వీటిపై గ్రామస్తుల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నాం. నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. అధికారుల సమన్వయ కృషి, నిబద్ధతతో ఈ అవార్డు దక్కింది.

– బొత్స మంగ, సర్పంచ్, బిళ్లనందూరు

ఉత్సాహంగా క్రీడోత్సవాలు

అమలాపురం రూరల్: ప్రపంచ పశు వైద్య దినోత్సవం సందర్భంగా జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో స్థానిక బాలయోగి స్టేడియంలో ఆటల పోటీలు ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగాయి. జిల్లాలోని పశు వైద్యులతో సాగిన ఈ క్రీడా పోటీలను జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జయపాల్, రాష్ట్ర పశు సంవర్ధక శాఖ శిక్షణ కేంద్రం సంయుక్త సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్, వీబీఆర్ఐ సంయుక్త సంచాలకులు డాక్టర్ చంద్రమౌళి ప్రారంభించారు. షటిల్ బ్యాడ్మింటన్, చదరంగం, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్ క్రీడల్లో జరిగిన పోటీల్లో ప్రతిభను చాటారు. షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్ పురుషుల విభాగంలో డాక్టర్ వీజీఎస్‌వీ ప్రసాద్, డాక్టర్ రేవంత్ (ద్వితీయ), డబుల్స్ విభాగంలో డాక్టర్ ఎల్.విజయరెడ్డి (ప్రథమ), డాక్టర్ అంబేడ్కర్ (ద్వితీయ), సింగిల్స్ మహిళల విభాగంలో డాక్టర్ హర్షిణి (ప్రథమ), డబుల్స్ విభాగంలో డాక్టర్ పూర్ణిమ (ప్రథమ) గెలుపొందారు. చదరంగంలో డాక్టర్ చెక్కపల్లి శ్రీరామ్ (ప్రథమ), డాక్టర్ శ్రీరామ్ (ద్వితీయ), క్యారమ్స్‌లో డాక్టర్ రవితేజ, డాక్టర్ అనితా కుమారి (ప్రతమ), డాక్టర్ సుధాకర్, డాక్టర్ జగదీష్ (ద్వితీయ) విజేతలుగా నిలిచారు. అమలాపురం ఉప సంచాలకులు డాక్టర్ కర్నీడి మూర్తి, జిల్లా పశు వైద్యాధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ శ్రీరామ్, సహాయ సంచాలకులు డాక్టర్ విజయరెడ్డి, డాక్టర్ రమేష్ పాల్గొన్నారు. చివరగా బహుమతులు ప్రదానం చేశారు.



క్రీడోత్సవాలను ప్రారంభిస్తున్న డాక్టర్ జయపాల్

రైతు సంక్షేమానికి పెద్దపీట

- రాజ్యసభ సభ్యుడు సుభాష్ చంద్రబోస్
- అట్టహాసంగా ముమ్మిడివరం మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

ముమ్మిడివరం: రైతు సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. మహిపాల చెరువు గ్రాండ్‌పార్క్‌లో ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం అట్టహాసంగా జరిగింది. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి రైతులకు మార్కెట్ కమిటీలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో సమూల మార్పులు తీసుకొచ్చారన్నారు. రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సుమారు రూ.1.30 లక్షల కోట్ల వడ్డీ రాయితీని రైతులకు అందించారని చెప్పారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు మరిన్ని సేవలందించేందుకు ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. అన్ని వర్గాలకు సముచిత న్యాయం చేయాలన్న ఉద్దేశంతో శివన్నారాయణను చైర్మన్‌గా ఎంపిక చేశామన్నారు. అనంతరం గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, చైర్మన్‌గా కుడిపూడి శివన్నారాయణ, వైస్ చైర్మన్‌గా కాశి హనుమంతరావు, డైరెక్టర్లుగా సంగాని వీర నాగేశ్వరమ్మ, ముసునూరి శ్రీలత, సవరపు లోవ లక్ష్మి, ముదునూరి వెంకటేశ్వరరాజు, వల్లభరెడ్డి పద్మావతి, మండపాటి మహాలక్ష్మి, కాజా అరుణ, బసవా రామలక్ష్మణరావు తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎంపీపీలు కోలా గంగాభవానీ, రాయుడు సునీత, మిరియాం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యులు కుడిపూడి శంకరరావు, ముదునూరి సతీష్‌రాజు, దొమ్మేటి శామ్యూల్ సాగర్, చెల్లు బోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలక వర్గం

ఆందోళికరం

- ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షం
- పంట ఒబ్బిడి చేసుకునేందుకు అన్నదాతలు ఉరుకులు పరుగులు
- అధికారులతో జేసీ టెలి కాన్ఫరెన్స్
- క్షేత్రస్థాయిలో అండగా నిలవాలని ఆదేశాలు



మండపేటలో కళ్లం వద్ద రైతులకు సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ రాజు, ఏఓ ఏసుబాబు

మండపేట: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో వాతావరణ మార్పులు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వాయవ్య మధ్యప్రదేశ్ నుంచి దక్షిణ తమిళనాడు వరకూ కొనసాగుతున్న ద్రోణి కారణంగా జిల్లాలో అకాల వర్షం ఆదివారం తెల్లవారు జాము నుంచి ఉదయం 10 గంటల వరకూ కురిసింది. జిల్లాలో రబీ సాగు తుది దశకు చేరుకోగా మాసూళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ దశలో అకాల వర్షం పొలాల్లోని పంటను ఒబ్బిడి చేసుకునేందుకు రైతులను ఉరుకులు పరుగులు పెట్టించింది. ఉన్నతస్థాయి ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటించి రైతాంగానికి అండగా నిలుస్తోంది.

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో ఆదివారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. అమలాపురం, ముమ్మిడివరం, పి.గన్నవరం, కొత్తపేట, మండపేట తదితర నియోజకవర్గాల్లో దాదాపు రెండు గంటలు కుండపోతగా కురిసిన వర్షంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈదురుగాలుల ప్రభావంతో కాట్రేనికోన, రాజోలు, ఉప్పలగుప్తం, మండపేట తదితర చోట్ల చెట్లు నేలకొరిగి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అధికారులు మరమ్మతులు చేసి మధ్యాహ్న సమయానికి సరఫరాను పునరుద్ధరించారు.

ఉరుకులు పరుగులు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని తూర్పు, మధ్యడెల్టాలో 1.72 లక్షల ఎకరాల్లో రైతులు రబీ సాగు చేశారు. పంట తుది దశకు చేరుకోగా వరికోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. వాతావరణం అనుకూలించి తెగుళ్ల బెడద తక్కువగా ఉండటం, నీటి ఎద్దడి లేకుండా అధికార యంత్రాంగం తీసుకున్న చర్యలతో పంట ఆశాజనకంగా పండింది. పంట కోత ప్రయోగాల్లో ఎకరాకు 60 బస్తాల వరకు దిగుబడి వస్తున్నట్టు వ్యవసాయాధికారులు అంటున్నారు. ముందుగా సాగు జరిగిన అమలాపురం, మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో తుది దశ పనులు జోరుగా జరుగుతున్నాయి. దళారుల బెడద లేకుండా రైతులకు అండగా ప్రభుత్వం జిల్లాలో 390 ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లా వ్యాప్తంగా శనివారం నాటికి 42 వేల ఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయి. అధిక శాతం విస్తీర్ణంలో వరికోత యంత్రాలతో కోతలు కోస్తుండటంతో ధాన్యంలో తేమశాతం తగ్గించుకునేందుకు కళ్లాల్లోను, రోడ్ల పక్కన ఆర బెడుతున్నారు. రాత్రిళ్లు ధాన్యాన్ని రాశులుగా చేసి బరకాలతో కప్పేస్తున్నారు. ఊహించని విధంగా ఆదివారం తెల్లవారుజామున కురిసిన భారీవర్షంతో ధాన్యపు రాశుల వద్దకు రైతులు పరుగులు తీయాల్సి వచ్చింది. ఆదివారం ఎక్కడ చూసినా రాశుల్లోకి వర్షపు నీరు చేరకుండా చుట్టూ బాటలు వేయడం, తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవడం కనిపించింది. ఈదురు గాలులతో వరి పంట నేలకొరగడం, వర్షం వల్ల ధాన్యంలో తేమ శాతం పెరిగిపోయి ధర తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో రెండు వారాల పాటు వాతావరణం అనుకూలిస్తే చాలా వరకు పంట గట్టెక్కిపోతుందని వారంటున్నారు.

అధికార యంత్రాంగం అప్రమత్తం

మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ చేసిన హెచ్చరికల నేపథ్యంలో రైతులకు అండగా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఆదివారం ఉదయమే జేసీ ధ్యానచంద్ర మండల స్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. ఆయన ఆదేశాల మేరకు తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వ్యవసాయాధికారులు గ్రామాల్లోకి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పంటను కాపాడుకునేందుకు సూచనలు, సలహాలు అందించారు. పల్లపు ప్రాంతాల్లో ఉన్న రాశులను మెరక ప్రాంతాలకు తరలించుకోవాలని, తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని సూచించారు. ఇంకా పంట కోయని రైతులను ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మరో రెండు మూడు రోజుల తర్వాత కోసుకోవాలని సూచిస్తున్నారు. బరకాలు అవసరమైన రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరిపోయిన ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసి మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుత వర్షం వల్ల పెద్దగా ఇబ్బంది లేకున్నా ఇదే పరిస్థితి కొద్ది రోజుల పాటు కొనసాగితే పంటకు నష్టం తప్పదని వ్యవసాయాధికారులు అంటున్నారు.

కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

అమలాపురం టౌన్: పలు ప్రాంతాల్లో బలమైన గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో అవస్థలు పడుతున్నారు. రాజోలు దీవిలో గాలులు, పిడుగుల వల్ల పలుచోట్ల విరిగిన విద్యుత్ స్తంభాల వల్ల కొన్ని గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాజోలు దీవిలో దాదాపు 25 విద్యుత్ స్తంభాలు వర్షాలు, గాలుల తాకిడికి నేల కూలాయి. కాట్రేనికోన మండలం పల్లంకుర్రులో రోడ్డుపై ఆగి ఉన్న ఆటోపై కొబ్బరి చెట్టు కూలడంతో అది ధ్వంసమైంది. ఆ సమయంలో ఆటోలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. జిల్లాలోని 22 మండలాల్లో భారీ వర్షం తాకిడి ఉంది. ధాన్యం రైతుల దయనీయ పరస్థితి వర్ణనాతీతం. మామిడి తోటల్లో పక్వానికి రాకుండానే కాయలు గాలుల ఉధృతికి నేల రాలాయి. మలికిపురం మండలం గూడపల్లిలో మామిడి తోటలకు తీవ్ర నష్టం వచ్చింది. ఎండాకాలంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రతీ రోజూ కొబ్బరి తోటల్లో దింపు తీయించే పనుల్లో నిమగ్నమవుతారు. అయితే అకాల వర్షాలతో తోటల్లో చేరిన వర్షపు నీటితో దింపులకు అంతరాయం ఏర్పడి వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. అకాల వర్షం ఇలా జిల్లాలోని అన్ని వర్గాల వారిని నిరాశ పరిచింది. తెల్లవారు జామున ఓ మాదిర చిరు జల్లులు, గాలులతో మొదలైన వర్షం ఉదయానికి కల్లా భారీ వర్షంగా మారింది. దీనికితోడు ఉరుములు, పిడుగులు, బలమైన గాలులతో కొబ్బరి చెట్లు అటు ఇటు ఊగిపోవడంతో జనం మరింత ఆందోళనకు గురయ్యారు. అయితే అక్కడ నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టి క్రమేపీ ఎండ కాయడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు. తడిసిన ధ్యానాన్ని ఎండలో ఆరబెట్టుకునేందుకు, పడిన విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించుకునేందుకు, నేల కూలిన చెట్లను రోడ్లపై నుంచి తొలగించేందుకు ఆగిన వర్షం వెసులుబాటు కల్పించింది.



కాట్రేనికోన మండలం పల్లంకుర్రులో ఈదురు గాలులకు చెట్టు పడి ధ్వంసమైన ఆటో



కాట్రేనికోనలో కాలువ నీరు పోటెత్తడంతో నీట మునిగిన వరి పనలు

సగటు వర్షం పాతం 15.8 మిల్లీమీటర్లు

జిల్లాలో ఆదివారం రావులపాలెం మండలంలో తప్ప మిగిలిన 21 మండలాల్లో వర్ష పాతం నమోదైంది. జిల్లా మొత్తం మీద 376.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైతే సగటున 15.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా అమలాపురంలో 47.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా పి.గన్నవరంలో 1.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా వర్షపాతాలు ఇలా ఉన్నాయి.

క్లుప్తంగా

పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చిన జీయర్ స్వామి, రామానుజ జీయర్ స్వామి

కొవ్వూరు: పట్టణంలోని ఆంధ్రా గీర్వాణ విద్యాపీఠంలో ఆదివారం పలువురు ప్రముఖ పండితులు రచించిన పుస్తకాలను త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి చేతుల మీదుగా ఆవిష్కరించారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత, మహా మహోపాధ్యాయ సముద్రాల వెంకటరంగ రామానుజాచార్యులు శ్రీనాథుడు రాసిన పల్నాడు చరిత్రను శ్రీవీర భాగవతం పేరుతో సంస్కృతంలోకి అనువదించారు. ఈయన రచించిన పురాణ వాఙ్మయ పరిచరణము, మీమాంస శాస్త్రం, రావూరి వెంకటేశ్వర్లు రచించిన పర్ణశాల చరిత్ర, అపార భాగవతం పుస్తకాలను ఆవిష్కరించారు. అహోబిలం పీఠాధిపతి శ్రీమాన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి, దేవనాథ రామానుజ జీయర్ స్వామి సమక్షంలో ఈ ఐదు పుస్తకాలు ఆవిష్కరించారు. బేతవోలు రామబ్రహ్మం, అద్దంకి శ్రీనివాస్, కర్రి శ్రీరామమూర్తి శాస్త్రి, జీబీవీ సుబ్రహ్మణ్యం, టీఎస్‌వీ రమణమూర్తి పాల్గొన్నారు.

చెట్టు కొమ్మ తగిలి కింద పడిన కంటైనర్



రోడ్డుపై పడిపోయిన కంటైనర్

రావులపాలెం: ట్రాలీ లారీపై తీసుకువెళుతున్న కంటైనర్‌కు రోడ్డు పక్కన ఉన్న చెట్టు కొమ్మ తగలడంతో కంటైనర్ కిందపడిపోయింది. ఆదివారం సాయంత్రం మండలంలోని అమలాపురం రోడ్డులో పెకులపాడు గరువు సమీపంలో జరిగిన ఈ ఘటనతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ప్రమాదంలో విద్యుత్ వైర్లు అంటుకుని మంటలు రావడంతో స్థానికులు భయాందోళన చెందారు. పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపి వేయించారు. క్రేన్ సాయంతో కంటైనర్‌ను రోడ్డు పక్కకు తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ఘటనతో సుమారు గంటసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

సత్తెన్న కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు

- విద్యుత్ దీపాలంకరణతో శోభిల్లుతున్న రత్నగిరి
- 30 నుంచి అంగ రంగ వైభవంగా జరగనున్న ఉత్సవాలు
- ఒకటిన పరిణయ వేడుక



రత్నగిరి ఘాట్‌రోడ్డులో సాగుతున్న మరమ్మతులు



ఆకట్టుకుంటున్న విద్యుత్ దీపాలంకరణ

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాకినాడ జిల్లా అన్నవరంలోని శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో మరో ఆరు రోజుల్లో సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలు ప్రారంభమవుతుండడంతో ఏర్పాట్లు వేగం పుంజుకున్నాయి. ఈ నెల 30 వ తేదీ వైశాఖ శుద్ధ దశమి ఆదివారం సాయంత్రం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను వధూవరులను చేయడంతో ఉత్సవాలు మొదలవుతాయి. మే ఒకటో తేదీ వైశాఖ శుద్ధ ఏకాదశి, సోమవారం రాత్రి తొమ్మిది గంటల నుంచి సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల దివ్యకల్యాణ మహోత్సవం ప్రారంభమవుతుంది. రాత్రి 11–30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. మే ఆరో తేదీ రాత్రి జరుగనున్న సత్యదేవుని శ్రీపుష్పయాగంతో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి.

విద్యుత్ దీపాలంకరణతో కనువిందు

సత్యదేవుని కల్యాణ మహోత్సవాల సందర్భంగా దేవస్థానంలో విద్యుత్ అలంకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే స్వామివారి ప్రధానాలయం, రామాలయం, ఆలయ ప్రాంగణం, రెండు రాజగోపురాలు, రెండు ఘాట్‌రోడ్లకు ఇరు వైపులా రంగు రంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. వీలున్న ప్రతీచోట విద్యుత్ కటౌట్లను ఏర్పాటు చేస్తున్నారు. గత ఏడాది కన్నా దాదాపు రెట్టింపు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు.

రోడ్లకు మరమ్మతులు...ఆలయాలకు రంగులు

రెండు ఘాట్ రోడ్లకు మరమ్మతులు చేస్తున్నారు. రోడ్ల మీద చాలాచోట్ల గోతులు ఉండడంతో వాటిని పూడ్చి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. సత్యదేవుని ప్రధానాలయం, రాజగోపురం ద్వారాలకు రంగులు వేశారు. పలు ప్రదేశాలలో ఆకర్షణీయంగా ఉండేలా రంగులు వేశారు. ఇంకా చలువ పందిళ్లు కూడా చాలా ప్రదేశాలలో వేశారు.

నేటి నుంచి ప్రముఖులకు ఆహ్వానాలు

సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలకు రావాలని పలువురు ప్రముఖులకు ఆహ్వానాలు అందచేయనున్నారు. ఉప ముఖ్యమంత్రి, దేవదాయ, ధర్మదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీత, స్థానిక శాసనసభ్యుడు పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్, కలెక్టర్, ఎస్పీ, ఇతర ప్రజాప్రతినిధులను కలిసి ఆహ్వాన పత్రికలు ఒకటి రెండ్రోజుల్లో అందజేయనున్నారు.

చందనోత్సవ అనుభవంతో విస్తృత ఏర్పాట్లు

ఆదివారం నిర్వహించిన సింహాచల స్వామి శ్రీ వరాహ నృసింహస్వామి వారి చందనోత్సవంలో పలువురు ప్రముఖులు, భక్తులకు చేదు అనుభవం ఎదురైన సందర్భంగా అటువంటి పరిస్థితి తలెత్తకుండా సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఈ ఆరు రోజులు దేవస్థానంలోనే ఉండి స్వయంగా ఏర్పాట్లు పర్యవేక్షించనున్నారు. ప్రధానంగా స్వామివారి కల్యాణం రోజు, 30వ తేదీ నుంచి నాలుగో తేదీ వరకు జరిగే ఊరేగింపులు తిలకించేందుకు భారీగా భక్తులు తరలి వస్తారు. ఏర్పాట్లలో కూడా ఏకపక్షంగా కాకుండా అనుభవజ్ఞులైన వారి అభిప్రాయాలు తీసుకుని ముందుకు వెళ్లాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అన్నవరం దేవస్థానానికి శంకరాచార్య విగ్రహం సమర్పణ



దాతల వద్ద నుంచి ఆదిశంకరాచార్య విగ్రహాన్ని స్వీకరిస్తున్న అధికారులు



దాతలు బహూకరించిన విగ్రహం

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి జగద్గురు ఆది శంకరాచార్య పంచలోహ విగ్రహాన్ని చెన్నైకి చెందిన భక్తులు కౌశిక్, రాహుల్ ఆదివారం సమర్పించారు. తమ మేనమామ చామర్తి కనకశర్మ జ్ఞాపకార్థం ఈ విగ్రహాన్ని సమర్పించామని వారు తెలిపారు. ఈ విగ్రహం బరువు 3 కిలోలు కాగా, తయారీకి రూ.25 వేలు ఖర్చయిందన్నారు. దేవస్థానం ఏఈఓ ఎల్.శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ వెంకట రమణ, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, వ్రత పురోహిత సంఘం అధ్యక్షుడు నాగాభట్ల రవిశర్మ తదితరులు ఈ విగ్రహాన్ని దాతల నుంచి స్వీకరించారు. ఈ నెల 25న ఆదిశంకరుల జయంతి సందర్భంగా ఈ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేయించి, ఆలయ ప్రాకారంలో ఊరేగిస్తామని వారు తెలిపారు.

రెవెన్యూ శాఖలో అనూహ్య మార్పులు చేశాం

- పరిపాలనా వికేంద్రీకరణకు ప్రజల మద్దతు ఉంది
- మంత్రి ధర్మాన ప్రసాదరావు



తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు ధర్మాన, వేణు. చిత్రంలో ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు రాజా, వెంకట్రావు, కలెక్టర్ మాధవీలత

గోపాలపురం: రెవెన్యూ శాఖలో అనూహ్య మార్పులు చేశామని, ఈనాం చట్టంలో సవరణలు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖమంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆదివారం గోపాలపురంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్, గ్రామసచివాలయం, రైతు భరోసా కేంద్రాలను మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ పార్టీ అధ్యక్షుడు జక్కంపూడి రాజా, జిల్లా కలెక్టర్ కె.మాధవీలత, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాలపురం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో అనేక మార్పులు చేశామన్నారు. అవినీతి లేని పాలనలో రాష్ట్రం ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి అంశాన్ని అమలు చేసినట్లు గుర్తుచేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి కన్నా ఎక్కువగా ఆలోచించే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. రాజ్యాంగ బద్ధంగా పరిపాలనా వికేంద్రీకరణ చేసి నాలుగేళ్లుగా ఆంక్షలు లేనివిధంగా నిష్పక్షపాతంగా పాలన చేస్తూ ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచామన్నారు. పరిపాలనా వికేంద్రీకరణకు ప్రజలు మద్దతు తెలియజేస్తున్నారని మంత్రి అన్నారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ దేశానికి వెన్నెముక అయిన రైతుకు భరోసా కల్పిస్తూ నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో 81 గ్రామ పంచాయతీలలో సచివాలయాలు నిర్మించామన్నారు. జేసీ ఎస్.తేజ్‌భరత్, నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధన్, గోపాలపురం సర్పంచ్ పైడి శిరీష, మండల పార్టీ కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు పాల్గొన్నారు.

పార్టీని నాశనం చేస్తున్నది వర్మే

- టీడీపీ అధికార ప్రతినిధి వర్మపై తమ్ముళ్ల ఆగ్రహం
- అధిష్టానం వద్దే తేల్చుకుంటామంటూ సవాళ్లు



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ బహిష్కృత నేతలు

పిఠాపురం: తెలుగు తమ్ముళ్ల కుమ్ములాట తారస్థాయికి చేరింది. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ శుక్రవారం టీడీపీ నుంచి కొందరు నేతలను బహిష్కరించగా వారు ఆయన తీరును తీవ్రంగా తప్పుబడుతున్నారు. గొల్లప్రోలులో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు బవిరిశెట్టి రాంబాబు మాట్లాడుతూ 45 ఏళ్లుగా రామ లక్ష్మణులుగా కలిసిమెలిసి పోతున్న అన్నదమ్ములను (తునిలో యనమల సోదరులను) కుటిల రాజకీయాలతో విడదీసిన ఘనుడవు అంటూ వర్మపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక నియంతలా పరిపాలించడమే కాకుండా పదవి పోయాక కూడా కింది స్థాయి నాయకులను అణగదొక్కే ప్రయత్నాలు మానలేదని అన్నారు. ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ చైర్మన్లను కీలు బొమ్మలుగా చేసిన నీచుడని వర్మపై నిప్పులు చెరిగారు.

కాకినాడకు చెందిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు మాదేపల్లి శ్రీను మాట్లాడుతూ కాపు సామాజిక వర్గ నేతలను ఎదగనీయకుండా చేశారన్నారు. డబ్బులిచ్చుకుని తనకు సొసైటీ పదవి ఇచ్చారని అన్నారు. టీడీపీ అనే పదాన్ని వదిలేసి 'మీ ఇంటికి మీ వర్మ' అని పెట్టుకుని తిరిగినప్పుడే మీరు పార్టీని నాశనం చేస్తున్నారని, ఇతర పార్టీల వైపు చూస్తున్నారని అధిష్టానానికి అర్థమయ్యిందన్నారు. గతంలో నాయకులందరం కలిసి కట్టుగా పని చేస్తేనే ఆయన ఎమ్మెల్యే అయ్యారన్న సంగతి మర్చి పోయి గ్రూపు రాజకీయాలు చేసి అందరిని విడగొట్టి విభజించు పాలించు అనే ధోరణితో పార్టీని ముక్కలు చేస్తున్నారని ఆయన వర్మపై మండిపడ్డారు. నన్ను రెచ్చగొడితే నీ జాతకాన్ని బయటపెడతానంటూ హెచ్చరించారు. నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు జ్యోతుల సతీష్, మాట్లాడుతూ కనీసం షోకాజ్ నోటీస్ కూడా ఇవ్వకుండా మమ్మల్ని సస్పెండ్ చేసినట్లు ప్రకటించడం వర్మ నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. అసలు పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తున్నది ఎవరో పార్టీ అధిష్టానం దగ్గరే తేల్చుకుంటామని అన్నారు. టీడీపీ నేతలు కె.సత్యనారాయణ, పినకా వెంకట్రావు, వీఎస్ నారాయణ, గురాల వీరాస్వామి, చోడిశెట్టి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల అభ్యున్నతికి కృషి

- ఉమ్మడి తూర్పుగోదావరి డీసీసీబీ చైర్మన్ వీర్రాజు
- ఏపీ సహకార సంఘాల ఉద్యోగులు యూనియన్ రాష్ట్ర 7వ మహాసభలు



మహాసభలో డీసీసీబీ చైర్మన్ వీర్రాజుకు జ్ఞాపికను అందజేస్తున్న ఉద్యోగ సంఘ నేతలు

రాజమహేంద్రవరం రూరల్: సహకార సంఘాల ఉద్యోగుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. ఆదివారం బొమ్మూరులోని చెరుకూరి కన్వెన్షన్‌లో ఏపీ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర 7వ మహాసభలు రాష్ట్ర అధ్యక్షుడు పీవీ సత్యనారాయణరాజు అధ్యక్షతన జరిగాయి. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరైన డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ ప్రభుత్వం సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తుందని, ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేస్తామని, సొసైటీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సహకార సంఘాల ప్రైవేటీకరణపై పోరాటం ఉధృతం చేయాలని, సహకార ఉద్యోగులకు వేతన సవరణ చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం సహకార సంఘాలలో 50 శాతం వాటాలను ప్రైవేట్ వ్యక్తులకు, కంపెనీలకు, ఫండ్స్‌కు కేటాయిస్తూ 1964 సహకార సంఘాల చట్టానికి సవరణ చేసిందని మేనేజింగ్ కమిటీలోకి వృత్తి నిపుణుల పేరుతో ప్రైవేట్ వ్యక్తులను ప్రవేశపెట్టి ఓటింగ్ హక్కును కల్పించిందని అన్నారు. ఫైనాన్స్ బ్యాంకు ప్రతినిధులను కూడా మొదటిసారిగా మేనేజింగ్ కమిటీలోకి తీసుకొచ్చి ఓటు హక్కును కల్పించిందని, రైతులు చేతుల్లో ఉన్న పీఏసీఎస్‌లో ప్రైవేట్ వ్యక్తులు కంపెనీ చేతుల్లోకి పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. పీఏసీఎస్‌ల ప్రైవేటీకరణ వల్ల రైతులకు, సహకార సంఘాల్లో పని చేసే ఉద్యోగులకు తీవ్ర నష్టం కలుగుతుందని అన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి పెంకె సత్యనారాయణ మాట్లాడుతూ 2014 నుంచి కొత్త వేతనాలు అమల్లోకి రావాల్సి ఉండగా 2019 వరకు వేతన సాధన జరగలేదన్నారు. సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అజయ్ కుమార్ మాట్లాడుతూ పిఏసిఎస్ పీఏసీఎస్ ఉద్యోగుల పోరాట ఫలితంగా ఎన్నో విజయాలు సాధించారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి రాజులోవ, రాష్ట్ర కోశాధికారి తోట వెంకట రామయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.ఆదినారాయణ, కె.వి.వి.సత్యనారాయణ, వై.రామచంద్రరావు, తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, రాష్ట్ర నలుమూలల నుంచి 350 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

'డయల్ యువర్ ఈఓ' వాయిదా

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సోమవారం జరగాల్సిన 'డయల్ యువర్ ఈఓ' కార్యక్రమాన్ని వాయిదా వేశారు. ప్రతి నెలా చివరి సోమవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కాగా ఈ వారం ఆలయ ఈఓ ఇతర కార్యక్రమాల్లో బిజీగా ఉండడం వలన 'డయల్ యువర్ ఈఓ'ను వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

7న ఆర్యవైశ్యుల సదస్సు



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్యవైశ్య నాయకులు

కొవ్వూరు: వచ్చే నెల ఏడో తేదీన రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో నిర్వహించే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఆర్యవైశ్యుల ఆత్మీయ సదస్సుకి ఆర్యవైశ్యులంతా తరలిరావాలని కొవ్వూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు(నాని) కోరారు. పట్టణంలో ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో ఆ సంఘం నాయకులు ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. ఈ సభ విజయవంతం చేయడం ద్వారా ఆర్యవైశ్యుల ఐక్యతను చాటి చెప్పాలన్నారు. భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక రుపొందిస్తారని ఆయన ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడు ఎంబీఎస్ ప్రసాద్(దత్తుడు) మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా తమ కులం ఉనికి చాటి చెబుదామని సూచించారు. వైశ్యులు పడుతున్న ఇబ్బందులు ఈ సమావేశంలో చర్చించనున్నట్లు ప్రకటించారు. ఉపాధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతీ ఒక్క నాయకుడు బాధ్యతగా తీసుకుని సదస్సుని విజయవంతం చేయాలని కోరారు. సంఘం కార్యదర్శి నాళ్లం వీర వెంకట శ్రీనివాసరావు, కోశాధికారి తుమ్మలపల్లి నాగ రమేష్, ముఖ్య సలహాదారుడు మద్దుల సత్యనారాయణ, మండల శాఖ అధ్యక్షుడు చక్కా శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు



వాడపల్లిలో దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్ రమేష్‌రాజు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిత్యాన్నదాన పథకానికి భక్తుల నుంచి విరాళాలు వచ్చాయని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. గుంటూరుకు చెందిన కె.నాగేశ్వరరావు, పద్మావతి దంపతులు రూ.25 వేలు, కడియం గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వర్లు, భాగ్యలక్ష్మి దంపతులు రూ.10,116, ఆలమూరుకు చెందిన పి.సత్యనారాయణ మూర్తి రూ.10 వేలు అందించారన్నారు. దాతలకు రమేష్‌రాజు చేతుల మీదుగా స్వామివారి చిత్రపటాలు బహూకరించారు.

అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

ర్యాలిలో అయ్యప్ప ఆలయ వార్షికోత్సవాన్ని కమిటీ నిర్వాహకులు, ప్రధాన అర్చకుడు రఘు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ప్రాంగణం అయ్యప్ప శరణు ఘోషలతో మార్మోగింది. రావులపాలేనికి చెందిన నందం రాజా రమేష్ సహకారంతో సుమారు 5 వేల మందికి అన్నదానం చేశారు.

క్రైం కార్నర్..

మానసిక క్షోభతో వ్యక్తి ఆత్మహత్య



ఖండవల్లిలో మృతుడు సూర్య నారాయణ

పెరవలి: మానసిక అనుభవిస్తున్న వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం జరిగింది. పెరవలి ఎస్‌ఐ ఎం.సూర్య భగవాన్ తెల్పిన వివరాలిలా ఉన్నాయి.

పెరవలి మండలం ఖండవల్లి గ్రామానికి చెందిన ఆకుల సూర్యనారాయణ (62) భార్య, కుమార్తె మృతి చెందటంతో తీవ్ర మనస్థాపానికి గురై మానసికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో ఈ నెల 21వ తేదీ అర్ధరాత్రి పురుగుమందు తాగాడు. ఈ విషయం తెలిసిన కుమారులు హుటాహుటిన తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించటంతో అప్పటి నుంచి వైద్యం పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అల్లవరం: ఓడలరేవు సముద్ర తీరంలో ఈ నెల 20న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అంబాజీపేట మండలం ఇసుకపూడి గ్రామానికి చెందిన దారా రమేష్ (26) చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడని ఎస్సై శ్రీనునాయక్ ఆదివారం తెలిపారు. ఓడలరేవు బీచ్‌లో పురుగుమందు సేవించి అపస్మారక స్థితిలో ఉన్న రమేష్‌ను స్థానికులు గుర్తించి అమలాపురం ఆస్పత్రికి తరలించారు.

అయితే మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పిడుగు పడి వ్యక్తి మృతి

రామచంద్రపురం రూరల్: మండలంలోని యనమదల వద్ద రొయ్యల చెరువుల్లో పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన కమలలోచన్ ధాకడ్(27) ఆదివారం పిడుగుపాటుకు గురై మృతి చెందినట్లు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ విలేకరులకు తెలిపారు.

కమలలోచన్ థాకడ్(ఫైల్) →



విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

రాజానగరం: రోజు ఆన్‌చేసే మంచినీళ్ల మోటారే, అయితే అదే ఆమె పాలిట మృత్యువైంది. మండలంలోని వెలుగుబందలో ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానిక ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాలిలావున్నాయి. వెలుగుబందకు చెందిన గట్టి ధనలక్ష్మి (47) మంచినీళ్ల ట్యాంకు నింపడం కోసం ఎప్పటిలాగే ఉదయం మోటారు ఆన్ చేయబోయి విద్యుత్ షాక్‌కి గురై, మృతి చెందింది. ఈ మేరకు ఆమె భర్త బాబ్జి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వ్యాను బోల్తా

కాకినాడ క్రైం: దైవ దర్శనానికి వెళ్లి వస్తూ కుటుంబాల సమేతంగా తిరుగు ప్రయాణమైన భక్తులకు చేదు అనుభవం ఎదురైంది. ఆదివారం ఏలూరు జిల్లా పెదవేగి మండలం న్యాయంపల్లి గ్రామానికి చెందిన 22 మంది భక్తులు లోవ దర్శనానికి టాటా ఏస్ వాహనంలో బయల్దేరారు. దర్శనం ముగించుకొని తిరుగు ప్రయాణం అయ్యారు. కాకినాడ పోర్టు వద్దకు చేరే సరికి వారు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ఘటనలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులు జీజీహెచ్‌లో ప్రథమ చికిత్స పొంది స్వగ్రామానికి బయల్దేరారు. ఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదు.